క్లుప్తంగా

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చిగురుమామిడి: అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి, కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి శనివారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రికి పలు సమస్యలను విన్నవించారు. చిగురుమామిడి మండలంలో చాలా మంది నిరుపేదలకు ఇళ్లు రాలేదని వారందరికి ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం అర్హులను గుర్తించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, సహాయకార్యదర్శి బూడిద సదాశివ ఉన్నారు.

సైకిళ్లు పంపిణీ



సైకిళ్లు పంపిణీలో కృష్ణారెడ్డి, నాయకులు

జమ్మికుంటరూరల్: మండలంలోని కోరపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు శనివారం సైకిళ్లు పంపిణీ చేశారు. పీఎం మోదీ కానుకగా పేద విద్యార్థులకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదినం పురస్కరించుకొని సైకిళ్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన వైద్యాధికారి



వంటగదిని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

హుజూరాబాద్: పట్టణ శివారు బోర్నపల్లిలోని మహాత్మా జ్యోతిరావుపూలే బాలుర గురుకుల పాఠశాలను శనివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ సిబ్బందితో కలిసి సందర్శించారు. వంటగది, బాత్‌రూంలు, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. వంట సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. విద్యార్థులను ఎలుకలు కొరికిన నేపథ్యంలో హాస్టల్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలుకలు, పాముల బారి నుంచి విద్యార్థులను కాపాడాలని, తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ రాణికి సూచించారు. వెంట జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్యామ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరం

బాలురను ఎలుకలు కొరికిన సంఘటన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పలు పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్లు కృష్ణారావు, మీనాక్షి, సూపర్‌వైజర్ రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న కవిత

చిగురుమామిడి: విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలని, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ జెండర్ స్పెషలిస్టులు కవిత, శైలజ సూచించారు. శనివారం మండలంలోని బొమ్మనపల్లి జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. లక్ష్యసాధన కోసం కష్టపడి చదువుతూ ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు జోత్స్న, బి. శంకర్, చంద్రశేఖర్, బాల్‌రెడ్డి, రమాదేవి, షర్మిల, కవిత, జ్యోతి, సీపీ దేశిని జ్యోతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని 39వ డివిజన్ వరసిద్ధికాలనీ, శ్రీరామకాలనీ, పార్వతినగర్ కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బీజేపీ నాయకుడు మాసం గణేశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం నగరపాలకసంస్థ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, స్ట్రీట్‌లైట్లు, ట్యాప్ కనెక్షన్లు సక్రమంగా లేవన్నారు. ప్రస్తుత వర్షాలతో రోడ్లు అధ్వానంగా మారాయని, చర్యలు తీసుకోవాలని కోరారు.

పచ్చని చెట్లకు గొడ్డలి వేటు



సైదాపూర్: హరితహారం కార్యక్రమానికి గొడ్డలి వేటు పడుతోంది. ఉపాధి హామీ పథకంలో ఏటా లక్షల మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ ఏపుగా పెంచుతున్నారు. వృక్షాలుగా మారిన తర్వాత రోడ్డు పక్కన వ్యవసాయ భూములు ఉన్న రైతులు, విద్యుత్ తీగల కింద చెట్లు ఉన్నాయని విద్యుత్‌శాఖ సిబ్బంది పచ్చని చెట్లు నరికేస్తున్నారు. కొన్నిచోట్ల తారురోడ్డు వరకు భూమి కబ్జా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. హుస్నాబాద్-హుజూరాబాద్ ప్రధాన రోడ్డు రాంచంద్రాపూర్ శివారులో, సైదాపూర్ - మొలంగూర్ రోడ్డు, సైదాపూర్-గర్రెపల్లి రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన హరితహారం చెట్లను ఇటీవల రైతులు నరికేశారు. ఈసారి హరితహారంలో నాటినా మొక్కలపై ఎప్పటికైనా గొడ్డలివేటు తప్పదని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి-సుందరగిరి గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగాఉంది. గ్రానైట్ లారీలు, టిప్పర్లతో గుంతలు ఏర్పడుతుండటంతో ద్విచక్ర వాహనదారులు, ఆటో, కార్లలో ప్రయాణించేవారు ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలిక మరమ్మతులు చేసినా ఫలితం శూన్యమని, మళ్లీ గుంతలు ఏర్పడుతున్నాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చివేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



శంకరపట్నం: విస్తారంగా కురుస్తున్న వర్షాలకు కన్నాపూర్ గ్రామంలోని కిష్కిందపల్లె ప్రజలు బురదరోడ్డుతో ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో మొరం పోయకపోవడంతో నీరు నిలిచి రోడ్డంతా బురదగా తయారైందని, ప్రత్యేక అధికారి పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇటీవల మాజీ సర్పంచ్ రోడ్డును ధ్వంసం చేశాడని, సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
కృష్ణప్రసాద్, ఎంపీడీవో, శంకరపట్నం సెల్ నం.9989930713

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

పనులు పూర్తయ్యేందుకు ఇంకెన్నేళ్లు..

- బొమ్మనపల్లిలో నత్తనడకన కూరగాయల మార్కెట్ పనులు
- వర్షాకాలంలో అవస్థలు పడుతున్న అమ్మకం, కొనుగోలుదారులు



మిగులు పనులు పూర్తికాక ప్రారంభానికి నోచుకోని కూరగాయల మార్కెట్

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్ పనులు నత్తనడన సాగుతున్నాయి. వర్షాకాలంలో కూరగాయలు విక్రయించేవారు, కొనుగోలు చేసేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీపీ కార్యాలయం ఎదుట రోడ్డుపైనే క్రయ, విక్రయాలు చేస్తున్నారు. ప్రతీ వారం గ్రామ పంచాయతీకి పన్ను చెల్లిస్తున్నప్పటికీ మౌలిక సౌకర్యాలు లేక అవస్థలుపడుతున్నామని అమ్మకందారులు వాపోతున్నారు. మరోవైపు చేసిన పనులకు బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్ ఆవేధన వ్యక్తం చేస్తున్నాడు. 2022లో మార్కెట్ నిర్మాణానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.12.11 లక్షలు మంజూరు చేసింది. ఏడాదిలోపు పనులు పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ ఏళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కరెంట్, వాటర్, మరుగుదొడ్లకు సంబంధించిన పనులు చేయాల్సి ఉంది. సంబంధిత అధికారులు పెండింగ్ బిల్లులు సత్వరమే చెల్లించి మిగులు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై ఇన్‌చార్జి ఏపీవో రవిరాజాను వివరణ కోరగా మార్కెట్ పనులు దాదాపు పూర్తికావచ్చాయని, పెండింగ్ బిల్లులు రావాల్సి ఉందని ఎంబీ రికార్డుచేసి అధికారులకు పంపామని, పెండింగ్ బిల్లులు రాగానే మిగులు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

జమ్మికుంట: మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద శనివారం మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని దహనం చేశారు. అనంతరం సీఎం, కాంగ్రెస్ నాయకులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేసేదాక ప్రజల పక్షాన ప్రశ్నిస్తూనే ఉంటామని, కేసులకు భయపడమని కేటీఆర్, కౌశిక్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ సంపత్, పట్టణ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్, భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు టౌన్ సీఐ కరుణాకర్‌కు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి హోదాలో ఇష్టం వచ్చినట్టు ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. నాయకులు శ్రీనివాస్, కొండాల్‌రెడ్డి, ప్రతాప తిరుమల్‌రెడ్డి, ముత్యం రాజు,ముక్క రమేష్, కుమారస్వామి, ఉమామహేశ్వర్,గందె శ్రీనివాస్ తదితరులున్నారు.

వీణవంక: మండలంలోని బీఆర్ఎస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగంగా కేటీఆర్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నాడని, లేనిపోని ఆరోపణలు చేస్తూ ఆత్మాభిమానం దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న రేవంత్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర నాయకులు మాడ సాదవరెడ్డి, మునిపట్ల తిరుపతిరెడ్డి, మవురపు విజయభాస్కర్‌రెడ్డి, రాయిశెట్టి శ్రీనివాస్, తాళ్లపెల్లి మహేశ్‌గౌడ్ ఉన్నారు.

దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్న పోలీసులు

ఇల్లందకుంట: మండల కేంద్రంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సరిగొమ్ముల పావనివెంకటేష్ ఆధ్వర్యంలో నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డిపై అక్రమ కేసులు పెడుతున్నారని, ప్రజలకోసం కొట్లాడే వ్యక్తి కౌశిక్‌రెడ్డి అని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ది చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అంతకుముందు సీఎం రేవంత్‌రెడ్డిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాయకులు సత్యనారాయణరావు, కుమార్, చిన్నరాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు



సీఐ రామకృష్ణకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

జమ్మికుంట: సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సీఐ రామకృష్ణకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేశ్, సీనియర్ నాయకుడు దేశిని కోటి ఆధ్వర్యంలో నాయకులు శనివారం ఫిర్యాదు చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. అనుచిత వ్యాఖ్యలు, ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్ పార్టీని బదనాం చేయడాన్ని ఖండించారు. చిల్లర మాటలు మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, కాంగ్రెస్ మండల మండల అధ్యక్షుడు పర్శరాంరావు, మాజీ కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య, బొంగోని వీరన్న, రవికంటి రాజు, ముద్దమల్ల రవి, పాతకాల అనిల్, పంజాల అజయ్ తదితరులు పాల్గొన్నారు. అనుచిత వ్యాఖ్యలను పీసీసీ మాజీ మెంబర్ పత్తి కృష్ణారెడ్డి ఖండించారు. పట్టణంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

హుజూరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు ఖండించారు. హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక, కమలాపూర్ మండలాల్లోని ప్రధాన చౌరస్తాల్లో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎంను విమర్శించే స్థాయి ఎమ్మెల్యేకు లేదని వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు.

వీణవంక: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎంకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎండీ సాహెబ్‌హుస్సేన్, గంగాడి తిరుపతిరెడ్డి, పంజాల సతీశ్, మ్యాక వీరయ్య, జగదీశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీపతిరెడ్డి, మాదాసు సునీల్, యూత్ ఉపాధ్యక్షుడు పోతరవేణ సతీశ్, చింతల హరీశ్‌రెడ్డి, ఓరెం అఖిల్, చేపూరి రాజు ఉన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

హుజూరాబాద్: జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు హుజూరాబాద్ పట్టణానికి చెందిన విద్యార్థులు కాశిరెడ్డి గౌతమ్, మేకల ప్రభాత్ విష్ణువర్ధన్, వేల్పుల రమ్య ఎంపికయ్యారని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ సారయ్య శనివారం ప్రకటనలో తెలిపారు. చండీఘడ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని, ఎంపిక పట్ల జాయింట్ సెక్రెటరీ ఎం. అంజయ్య, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

మాక్ పోలింగ్



ఓటువేస్తున్న విద్యార్థిని

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. సోషల్ టీచర్ మంచాల ఐలయ్య పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయగా పోలింగ్ సిబ్బందిగా మంకు రచన, బండారి రాజేశ్, వెంగల శరణ్య, దివ్య, వేముల వైష్ణవి వ్యవహరించారు. ఇల్లందుల అభిరామ్, పలవేని హాసిని, చింతల సాయిప్రసన్న, రావుల రిషివర్ధన్, సాయిప్రియ పోటీ చేసే అభ్యర్థులుగా పాల్గొన్నారు. మిగతా విద్యార్థులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. అనంతరం ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఏవిధంగా నిర్వహిస్తారు, ప్రజాప్రతినిధులను ఎలా ఎన్నుకుంటారో ఉపాధ్యాయుడు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్.వేణు, శంకర్, సురేశ్, అన్నపూర్ణ, రాధికారాణి, ఉమాదేవి, లక్ష్మణాచారి, పరమేశ్వర్ పాల్గొన్నారు.

నియామకం



ఉత్తర్వులు అందుకుంటున్న కాశెట్టి కుమార్

హుజూరాబాద్: పట్టణానికి చెందిన కాశెట్టి కుమార్‌ను మున్నూరుకాపు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తమరావు పటేల్ నియామక ఉత్తర్వులు అందజేశారు. వేములవాడలో మున్నూరుకాపు సమావేశంలో నియామకం జరిగింది. నియామకం పట్ల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

జమ్మికుంట: పట్టణంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భగవాన్ శ్రీసత్యసాయిబాబ జయంతి సందర్భంగా ఏషియన్ వాస్క్యులర్ హాస్పిటల్ హైదరాబాద్ సౌజన్యంతో ఆదివారం ఉదయం పదిగంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు రక్తనాళాల ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నామ సమితి కన్వీనర్ గన్ను సతీశ్ కుమార్ శనివారం తెలిపారు. రక్తనాళాలకు సంబంధించి రోగులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేస్తామని, పట్టణంలోని సత్యసాయి సేవా సమితి కాలేజీ రోడ్డులో ఉంటుందని, జమ్మికుంట పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాజీ సైనికులకు సన్మానం

కొత్తపల్లి: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శనివారం కొత్తపల్లిలో రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో మాజీ సైనికులు నారెడ్డి ఇంద్రాకర్‌రెడ్డి, ద్యావనపల్లి అనిల్, మండల అమరేందర్‌రెడ్డి, మావిశెట్టి రమేశ్, యాళ్ల మహేందర్ రెడ్డిలను ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన వీర సైనికులను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో దేశ రక్షణకు ప్రతి పౌరుడు కంకణబద్దులు కావాలని అన్నారు. కార్యదర్శి బండ కిషన్‌రెడ్డి, బీవోడీ సభ్యులు బండ గోపాల్‌రెడ్డి, గుండేటి రామచంద్రం, లంబు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలుగు పారుతున్న చెరువులు



గన్నేరువరం: మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు నిండుకుంటున్నాయి. శనివారం పారువెల్ల పెద్ద చెరువులోకి భారీగా వరద నీరు చేరడంతో అలుగు పారింది. ఏటా పారువెల్ల చెరువు మొట్టమొదటగా అలుగు పారుతుందని, నీరంతా గన్నేరువరం పెద్ద చెరువులోకి చేరుతుందని, వానాకాలం సాగుకు ఇబ్బంది ఉండదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి కిరణ్‌కుమార్

సైదాపూర్: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని హుజూరాబాద్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం సైదాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. వివిధ నేరాలకు సంబంధించిన సెక్షన్లు, శిక్షల గూర్చి వివరించారు. సదస్సులో హుజూరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుకుమార్, అడ్వకేట్ తిరుపతి, ఎస్ఐ తిరుపతి, ప్రిన్సిపాల్ మహేందర్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజశేఖర్, అధ్యాపకులు మహేందర్, రాజు, రవి, భాస్కర్, కృష్ణప్రసాద్, రాజశేఖర్, రమేశ్, విజయ్, శివాజీ, వినయ్ పాల్గొన్నారు.





ఏసీపీ మాధవిని పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

ఏసీపీ మాధవి కుటుంబానికి మంత్రుల పరామర్శ

కరీంనగర్‌టౌన్: హుజూరాబాద్ ఏసీపీ మాధవి భర్త డీఎస్పీ మహేశ్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ శనివారం పరామర్శించారు. కరీంనగర్‌లోని మాధవి ఇంటికి వెళ్లి మహేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మహేశ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సంజయ్‌ను చూడగానే విలపించిన మాధవిని ధైర్యంగా ఉండాలంటూ ఓదార్చారు. అదే విధంగా బాగా చదువుకుని తండ్రి ఆశయాలను నెరవేర్చాలని మాధవి-మహేశ్ కుమారులకు సూచించారు. మంత్రి వెంట ఆకాంక్షించారు. మాజీ మేయర్ సునీల్ రావు ఉన్నారు. అలాగే చెర్లభూత్కూర్‌కు చెందిన బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి రమణారెడ్డి తల్లి ఇటీవల మృతిచెందగా శనివారం కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ పరామర్శించారు.ఆయన వెంట మాజీ మేయర్ సునీల్‌రావు, బీజేపీ నాయకులు సంతోష్,శ్రవణ్, రమేశ్, అమరేందర్, నాగభూషణం, శ్రీనివాస్, మనోజ్, లక్ష్మణ్ తదితరులున్నారు.

కరీంనగర్‌కార్పొరేషన్: హుజూరాబాద్ ఏసీపీ మాధవిని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. శనివారం నగరంలోని ఆమె నివాసానికి వెళ్లి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మహేశ్ చిత్రపటానికి పూలువేసి నివాళి అర్పించారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి, కర్ర రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

అనిల్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్: మండల కేంద్రానికి చెందిన రిపోర్టర్ సిరిసిల్ల అనిల్‌కుమార్ కుటుంబాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం పరామర్శించారు. అనిల్‌కుమార్ తండ్రి నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అల్గునూరులోని అనిల్‌కుమార్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. వెంట కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఇంచార్జి గోపు మల్లారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, ముక్కిన రత్నాకర్‌రెడ్డి, సిరిసిల్ల బాలయ్య తదితరులు ఉన్నారు.

అసిస్టెంట్ కమాండెంట్ మెడికల్ ఆఫీసర్‌గా అజయ్



సన్మానిస్తున్న గ్రామస్తులు

వీణవంక: సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ మెడికల్ ఆఫీసర్‌గా మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పోతుల అజయ్‌కుమార్ ఎంపికయ్యాడు. పోతుల చంద్రయ్య-ఇందిర దంపతులకు కూతురు, ఇద్దరు కొడుకులు. కూతురు నవత ఎక్సైజ్, చిన్నకుమారుడు శ్రావణ్ సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ కొలువులు సాధించారు. పెద్ద కుమారుడు అజయ్ సైతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు. అలాగే అజయ్ ఇటీవల ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. కూలీ పనులు చేసుకొని జీవించే కుటుంబంలోని పిల్లలు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం పట్ల మాజీ సర్పంచ్ పోతుల నర్సయ్య, రాజయ్య, సతీశ్, సంపత్, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులు, కొడుకును సన్మానించారు.